# నమస్తే తెలంగాణ
## ములుగు జయశంకర్ భూపాలపల్లి
5 | గురువారం 18 ఏప్రిల్ 2024 | MULUGU JAYASHANKAR BHUPALPALLY


# కల్యాణం.. కమనీయం

### ఊరూరా వేడుకలా సీతారాముల కల్యాణం

### కన్నులపండువగా వివాహ ఘట్టం

అభిజిత్ లగ్న సుముహూర్తాన.. వేద పండితుల మంత్రోచ్ఛారణలతో.. అశేష భక్తజనం సమక్షంలో.. బుధవారం సీతారాముల కల్యాణం అంగరంగవైభవంగా జరిగింది. శ్రీరామనవమిని పురస్కరించుకొని ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఆలయాల్లో రాములోరి వివాహ వేడుక కన్నులపండువగా సాగింది. వేలాదిగా తరలివచ్చిన భక్తులతో ఆయా ఆలయాలు, కూడళ్లు కిక్కిరిసిపోగా, 'తలువాలు' కార్యక్రమం వారిలో తన్మయత్వాన్ని నింపింది.



హనుమకొండ రెవెన్యూకాలనీలో..



వరంగల్ చింతల్‌లోని భక్త హనుమాన్ ఆలయంలో..

# వరంగల్‌లో బీఆర్ఎస్‌దే విజయం

### 22న నామినేషన్‌కు శ్రేణులు తరలిరావాలి

### మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు




మాట్లాడుతున్న మాజీ మంత్రి ఎర్రబెల్లి

పాలకుర్తి రూరల్, ఏప్రిల్ 17: వరంగల్ ఎంపీ స్థానంలో బీఆర్ఎస్ ఘన విజయం సాధిస్తుందని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఏ సర్వే చూసినా వరంగల్ పార్లమెంట్ స్థానం బీఆర్ఎస్ కైవసం చేసుకుంటుందని వచ్చిందని చెప్పారు. కాంగ్రెస్ మూడో స్థానంలో ఉంటుందన్నారు. బీఆర్ఎస్‌కు బీజేపీ మధ్యనే పోటీ ఉంటుందని ఎర్రబెల్లి తెలిపారు. ఈ నెల 20న తొర్రూరులో ముఖ్య కార్యకర్తలతో సమావేశం ఉంటుందన్నారు. 22న బీఆర్ఎస్ అభ్యర్థి ఎం సుధీర్‌కుమార్ నామినేషన్ దాఖలు చేస్తారని చెప్పారు. ఈ కార్యక్రమానికి కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తరలిరావాలన్నారు. నాలుగు సార్లు ఓడిన కడియం శ్రీహరి తన గురించి మాట్లాడడం సిగ్గుచేటన్నారు. మోసాలకు మారు పేరైన శ్రీహరికి ఈ ఎన్నికల్లో ప్రజలకు గుణపాఠం చెబుతారని స్పష్టం చేశారు. సమావేశంలో ఎంపీపీ నల్లా నాగిరెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పసునూరి నవీన్, ఎఫ్ఎస్‌సీఎస్ బ్యాంక్ చైర్మన్ బొబ్బల ఆశోక్‌రెడ్డి, మాజీ సర్పంచ్ వీరమనేని యాకాంతారావు, బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి మాచర్ల ఎల్లయ్య, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ముస్కు రాంబాబు, మండల ఉపాధ్యక్షుడు పాము శ్రీనివాస్, కమ్మగాని నాగన్న, గర్వందుల మల్లేశ్, వెంకటేశ్ పాల్గొన్నారు.

వర్గపోరుతో సతమతమవుతున్న వరంగల్ కాంగ్రెస్‌లో కడియం శ్రీహరి రాకతో కొత్త లొల్లి షురూ అయింది. ఆయన చేరడంతోనే మొదలైన వ్యతిరేకత, కూతురు కావ్యకు లోక్‌సభ అభ్యర్థిగా టికెట్ ఇవ్వడంతో మరింత ముదిరింది. ఓ వైపు మంత్రుల ఎంపిక విషయంలో తమకు అన్యాయం జరిగిందని సీనియర్లు అసంతృప్తిగా ఉండడం.. మరోవైపు ప్రభుత్వ, పార్టీ కార్యక్రమాల సమన్వయంలో మంత్రులు, ఎమ్మెల్యేల మధ్య సఖ్యత లోపించిన తరుణంలో బీఆర్ఎస్ నుంచి కడియం చేరడంతో ప్రజాప్రతినిధులు, కార్యకర్తల్లో అసంతృప్తి, అసమ్మతి, అయిష్టత పెరిగి అస్తవ్యస్తంగా మారింది. ఇప్పటికే వరంగల్ లోక్‌సభ ఇన్‌చార్జి బాధ్యత రేవూరి ప్రకాశ్‌రెడ్డికి అప్పగించడంపై కొండా అసంతృప్తిగా ఉన్న తరుణంలో ఆయన పరకాల సమావేశంలో చేసిన వ్యాఖ్యలు వారి మధ్యనున్న విభేదాలకు మరింత ఆజ్యం పోశాయి. మొత్తానికి అభ్యర్థులే దొరకక అపసోపాలు పడి తెచ్చిపెట్టుకున్న 'కడియం'తో కాంగ్రెస్‌కు చిక్కులు తెచ్చిపెట్టాయి.

– వరంగల్, ఏప్రిల్ 17(నమస్తే తెలంగాణ ప్రతినిధి)



# కడియం.. హస్తవ్యస్తం

### కాంగ్రెస్‌లో శ్రీహరి చేరికతో కొత్త లొల్లి

### కావ్యకు వరంగల్ టికెట్ ఇవ్వడంతో మరింత వ్యతిరేకత

### ఆయన రాకపై మంత్రులు, ఎమ్మెల్యేల అయిష్టత

**ఇప్పటికే కొండా సురేఖ వర్సెస్ రేవూరి**

**వీరిద్దరి మధ్య బహిరంగంగానే విభేదాలు**

**లోక్‌సభ ఎన్నిక బాధ్యతలపైనా కొండా నారాజ్**

**రేవూరికి ఇన్‌చార్జి బాధ్యతలపై కాంగ్రెస్‌లో అసంతృప్తి**

బీఆర్ఎస్ తరపున స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యేగా గెలిచిన కడియం శ్రీహరి కాంగ్రెస్‌లో చేరిన తర్వాత ఆ పార్టీలో అసంతృప్తులు, అసమ్మతులు పెరుగుతున్నాయి. కడియం శ్రీహరిని పార్టీలో చేర్చుకోవడంపై వరంగల్ ఉమ్మడి జిల్లాలోని ఇద్దరు మంత్రులు, ఎమ్మెల్యేలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. శ్రీహరి కూతురు కావ్యకు వరంగల్ లోక్‌సభ అభ్యర్థిగా అవకాశం ఇవ్వడంపై అధికార పార్టీ ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే ఇద్దరు మంత్రుల మధ్య విభేదాలు ఉన్నాయి. మంత్రులకు, ఎమ్మెల్యేలకు మధ్య సఖ్యత కనిపించడం లేదు. లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో కాంగ్రెస్ అధిష్టానం తీసుకుంటున్న నిర్ణయాలు కాంగ్రెస్‌లో అసంతృప్తులను మరింత పెంచుతున్నాయి.

ఇటీవలి శాసనసభ ఎన్నికల్లో ఉమ్మడి జిల్లాలోని 12 అసెంబ్లీ స్థానాల్లో కాంగ్రెస్ 10చోట్ల విజయం సాధించింది. సమీకరణాల్లో భాగంగా కొండా సురేఖ, సీతక్కలకు మంత్రులుగా అవకాశం దక్కింది. మంత్రుల ఎంపిక తీరుపై పలువురు ఎమ్మెల్యేల్లో అసంతృప్తి ఉంది. 2014లో ఇండిపెండెంట్‌గా ఎన్నికై కాంగ్రెస్‌లో చేరిన తనకు గుర్తింపు ఇవ్వకపోవడంపై నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి అసంతృప్తితో ఉన్నారు. ప్రభుత్వ, పార్టీ కార్యక్రమాలకు అంటీముట్టనట్లుగానే ఉంటున్నారు. కొత్తగా పార్టీలో చేరిన వారికి అవకాశాలు ఇచ్చారని, 30 ఏళ్ల నుంచి సీనియర్ నేతగా ఉన్న తమలాంటి వారికి అన్యాయం జరుగుతున్నదని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి అనుచరులు చెబుతున్నారు. ప్రభుత్వ, పార్టీ కార్యక్రమాల సమన్వయంలోనూ మంత్రులు, ఎమ్మెల్యేల మధ్య సఖ్యత కనిపించడం లేదని కాంగ్రెస్ నాయకులే అంటున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో బీఆర్ఎస్ నుంచి గెలిచిన కడియం శ్రీహరిని చేర్చుకోవడంపై కాంగ్రెస్‌లోని అన్ని స్థాయిల వారూ అసంతృప్తితోనూ ఉన్నారు. అదీగాక ఆయన కూతురు కావ్యను వరంగల్ ఎంపీ అభ్యర్థిగా ఎంపిక చేయడంపై ఎమ్మెల్యేలు వ్యతిరేకంగా ఉన్నారు. స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గంలో కాంగ్రెస్ తరపున పోటీచేసిన సింగపురం ఇందిర వర్గం కడియం చేరికపై మండిపడుతున్నారు. ఈక్రమంలో కాంగ్రెస్‌లో తనపై ఉన్న వ్యతిరేకత నుంచి బయటపడేందుకు కడియం శ్రీహరి స్వయంగా మంత్రి కొండా సురేఖతో పాటు లోక్‌సభ సెగ్మెంట్‌లోని ఎమ్మెల్యేల ఇండ్లకు వెళ్లి కలిశారు. అయినా కావ్య అభ్యర్థిత్వంపై ఎమ్మెల్యేలు ఇష్టంగా లేరని కాంగ్రెస్ నాయకులు చెబుతున్నారు. తన చేరికపై ఎమ్మెల్యేల్లో ఉన్న వ్యతిరేక వైఖరిని కడియం శ్రీహరి, సీఎం రేవంత్‌రెడ్డికి వివరించి సమన్వయం చేయాలని కోరినట్లు తెలిసింది. లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో వరంగల్ లోక్‌సభ పరిధిలోని మంత్రులు, ఎమ్మెల్యేలతో సీఎం సమావేశం నిర్వహించగా ఆ తర్వాతే కాంగ్రెస్ అభ్యర్థి కావ్య నియోజకవర్గాల్లోని సమావేశాలకు హాజరవుతున్నారు. సీఎం ఆదేశాలతో సమావేశాలు నిర్వహిస్తున్నప్పటికీ బీఆర్ఎస్ నుంచి వచ్చిన కడియం విషయంలో మాత్రం పార్టీ శ్రేణుల్లో ఉన్న వ్యతిరేకత తగ్గడం లేదని కాంగ్రెస్ నాయకులు చెబుతున్నారు. ఇటీవల జరిగిన స్టేషన్ ఘన్‌పూర్‌లో, పరకాల పార్టీ సమావేశాల్లో కాంగ్రెస్‌లోని వర్గపోరు బహిర్గతమైందని గుర్తుచేస్తున్నారు.

### కొండా X రేవూరి

వరంగల్ లోక్‌సభ ఎన్నికల కాంగ్రెస్ ఇన్‌చార్జిగా పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డిని పార్టీ నియమించింది. మిగతా లోక్‌సభ సెగ్మెంట్ల ఇన్‌చార్జీల బాధ్యతలను ఆయా జిల్లాలోని మంత్రులకు అప్పగించి.. వరంగల్ లోక్‌సభ సెగ్మెంట్ బాధ్యతలను మంత్రి కొండా సురేఖకు కాకుండా ఎమ్మెల్యే రేవూరికి అప్పగించడంపై ఇద్దరి మధ్య విభేదాలు తీవ్రమయ్యాయని కాంగ్రెస్ వర్గాలు చెబుతున్నాయి. ప్రస్తుతం జరుగుతున్న పరిణామాలు ఇందుకు బలాన్ని చేకూర్చుతున్నాయి. మంత్రి సురేఖకు, పరకాల ఎమ్మెల్యే రేవూరికి మధ్య ఆధిపత్య పోరు రోజురోజుకూ పెరుగుతున్నది. పరకాల నియోజకవర్గంలో ఇటీవల నిర్వహించిన ఎన్నికల సన్నాహక సమావేశంలో స్థానిక ఎమ్మెల్యే, పార్లమెంట్ ఇన్‌చార్జి రేవూరి ప్రకాశ్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలు ఉమ్మడి జిల్లాలోని పార్టీలో ఉన్న ఆధిపత్య పోరును స్పష్టం చేస్తున్నదని పార్టీ శ్రేణులు చెబుతున్నాయి. మంత్రి సురేఖ వద్దకు వెళ్లేవారు తన దగ్గరికి రావద్దని రేవూరి బహిరంగంగానే అన్నారు. సురేఖ గతంలో పరకాల ఎమ్మెల్యేగా వ్యవహరించారు. కాంగ్రెస్‌లోని తమ అనుచరులను రేవూరి టార్గెట్ చేశారని కొండా వర్గీయులు భావిస్తున్నారు. రేవూరి తమ అనుచరులతో వ్యవహరిస్తున్న తీరుకు నిరసనగానే మంత్రి సురేఖ పరకాల నియోజకవర్గ సమావేశానికి వెళ్లలేదని పార్టీలో చర్చ జరుగుతున్నది.

# ఉలిక్కిపడ్డ ఓరుగల్లు!

### ఎన్‌కౌంటర్‌తో ఉమ్మడి జిల్లా నక్సల్స్ కుటుంబాల్లో అలజడి

### ఎదురుకాల్పులు జరిగినా మృతుల్లో ఇక్కడి వారున్నారనే ప్రచారం

### దండకారణ్య కీలక పదవుల్లో 14 మంది ఉమ్మడి జిల్లావాసులే

సుబేదారి, ఏప్రిల్17: ఛత్తీస్‌గఢ్‌లోని బస్తర్ రీజియన్‌లోని కాంకేర్ జిల్లా అడవుల్లో మంగళవారం జరిగిన ఎన్‌కౌంటర్‌లో 29 మంది మావోయిస్టులు మృతి చెందడంతో ఓరుగల్లు ఉలిక్కిపడింది. ఎక్కడ ఎదురుకాల్పులు జరిగినా మృతుల్లో ఇక్కడి వారు ఉండవచ్చుననే ప్రచారం జరుగుతోంది. తాజాగా నార్త్ బస్తర్ డివిజన్ కమిటీ ఇన్‌చార్జిగా పనిచేస్తున్న భూపాలపల్లి జిల్లా చల్లగరిగె గ్రామానికి చెందిన సిరిపెల్లి సుధాకర్ అలియాస్ శంకర్‌రావు, ఆయన భార్య సుమన అలియాస్ రజిత కూడా చనిపోయినట్లు వార్తలు వచ్చాయి. దీంతో ఉమ్మడి వరంగల్ జిల్లా నుంచి పనిచేస్తున్న నక్సల్స్ కుటుంబ సభ్యులు, బంధువులు, సానుభూతి పరుల్లో అలజడి రేకెత్తింది. కొద్దిరోజుల క్రితం ఇదే అడవుల్లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో కాటారం మండలం అంకుశాపురం గ్రామానికి చెందిన నార్త్ బస్తర్ డివిజన్ కమిటీ ఇన్‌చార్జి అన్నె సతీశ్ అలియాస్ సాగర్ మృతి చెందాడు. మావోయిస్టులకు రక్షణ కవచంగా ఉన్న ఛత్తీస్‌గఢ్ దండకారణ్యం వేసవిలో ఆకురాలి పలుచబడడంతో పాటు వారి కదలికలను అధునాతన పరికరాలతో పోలీసు బలగాలు సులువుగా తెలుసుకోవడం మూలంగా ఈ సీజన్‌లో ఎక్కువ మంది నక్సల్స్ మృతి చెందినట్లు తెలుస్తున్నది.

#### ఉమ్మడి జిల్లా నుంచి కీలక నేతలు..

ఉమ్మడి వరంగల్ జిల్లా నుంచి పోలీసు రికార్డుల్లో 42మంది మావోయిస్టు పార్టీలో ఉన్నారు. ఇందులో హనుమకొండ, వరంగల్ జిల్లాల నుంచి 16 మంది, జనగామ నుంచి ఒకరు, భూపాలపల్లి 13, ములుగు 10, మహబూబాబాద్ జిల్లా నుంచి ముగ్గురు ఉన్నారు. వీరిలో 14 మంది ఛత్తీస్‌గఢ్ దండకారణ్యంలో కీలక పదవుల్లో ఉన్నారు.

ములుగు జిల్లా వెంకటాపూర్ మండలం లక్ష్మీదేవిపేట శివారు పోలెనపల్లికి చెందిన తక్కళ్లపల్లి వాసుదేవరావు అలియాస్ ఆశన్న దండకారణ్యం స్పెషల్ జోన్ మిలీషియన్ కమిటీలో కీలక నేతగా ఉన్నారు. తాడ్వాయి మండలం కాల్వపల్లికి చెందిన బడే చొక్కారావు అలియాస్ దామోదర్ మావోయిస్టు పార్టీ తెలంగాణ మిలిటరీ ఇన్‌చార్జిగా వ్యవహరిస్తున్నారు. గోవిందరావుపేట మండలం మెద్దుల గూడేనికి చెందిన కొయ్యాడ సాంబయ్య అలియాస్ ఆజాద్ భద్రాద్రి కొత్తగూడెం-ఏపీ అల్లూరి సీతారామరాజు జిల్లాల డివిజన్ ఇన్‌చార్జిగా ఉన్నారు. కన్నాయిగూడెం మండలం యావికలగూడెం నుంచి పులిష పద్మ అలియాస్ సోనీ దండకారణ్యం డివిజన్ కమిటీ మెంబర్‌గా ఉన్నారు. ఈమె సెంట్రల్ కమిటీలో పనిచేసి చనిపోయిన కటకం సుదర్శన్ అలియాస్ ఆనంద్ భార్య. రాంచంద్రపూర్ గ్రామానికి చెందిన కనుకుంట్ల రాజు అలియాస్ స్వామి దండకారణ్యం ఏరియా కమిటీ సభ్యుడిగా కొనసాగుతున్నాడు. భూపాలపల్లి జిల్లా చిట్యాల మండలం వెలిశాల గ్రామానికి చెందిన గాజర్ల రవి అలియాస్ ఉదయ్ కేంద్ర కమిటీ సభ్యుడిగా, ఏఓబీ స్పెషల్ జోన కమిటీ ఇన్‌చార్జిగా పనిచేస్తున్నాడు. గాజర్ల రవితోపాటుగా, పంబాపూర్ గ్రామానికి చెందిన మచ్చ సమ్మయ్య అలియాస్ సతీశ్ దండకారణ్యం సౌత్ బస్తర్ డివిజన్ కమిటీ సభ్యుడిగా ఉన్నారు. మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మండలం బోరుబండకు చెందిన కర్రె వెంకట్‌రెడ్డి తెలంగాణ స్టేట్ కమిటీ సభ్యుడిగా, జనగామ జిల్లా నుంచి పరమానందరెడ్డి అలియాస్ శ్యాం దండకారణ్యం మడేరా డివిజన్ ఇన్‌చార్జిగా ఉన్నారు. వరంగల్ జిల్లా రాయపర్తి మండలం మైలారం గ్రామానికి చెందిన ఉల్లెంగుల యాకయ్య అలియాస్ అంజన్న దండకారణ్యం డివిజన్ కమిటీ కార్యదర్శిగా పనిచేస్తున్నాడు. ఖానాపూర్ మండలం బుధరావుపేటకు చెందిన కోడి మంజుల సౌత్ బస్తర్ డివిజన్ కమిటీ సభ్యురాలుగా ఉన్నారు. హనుమకొండ జిల్లా కాజీపేట మండలం సోమిడి గ్రామానికి చెందిన కుసునూరి నరహరి అలియాస్ సుభాష్ కీలక నేతగా ఉన్నారు. తరాలపల్లి గ్రామానికి చెందిన ముప్పిడి సాంబయ్య అలియాస్ సుదర్శన్ ఆంధ్రా-ఒడిశా సరిహద్దు ప్రాంతాల కీలక నేతగా ఉన్నారు. టేకులగూడేనికి చెందిన మాచర్ల యేసోబు అలియాస్ రణధీర్ బస్తర్ కమిటీలో కీలక నేతగా పనిచేస్తున్నాడు.



చల్లగరిగెలో రోదిస్తున్న సుధాకర్ తల్లి రాజపోశమ్మ

#### శంకర్‌రావు లేనట్టేనా?

ఎన్‌కౌంటర్‌లో సుధాకర్ అలియాస్ శంకర్‌రావు ఉన్నట్లు పోలీసులు అనుమానించారు. తర్వాత ఆయన కాదు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని ఆత్మకూర్ మండలం రామాపురానికి చెందిన సగునూరి చిన్నన్న అలియాస్ నాగన్నగా గుర్తించినట్లు ప్రచారం జరుగుతోంది.

# గురుకులంలో విద్యార్థుల గొడవ

### దామరవంచలో ఘటన.. ఆలస్యంగా వెలుగులోకి..

గూడూరు, ఏప్రిల్ 17: మహబూబాబాద్ జిల్లా గూడూరు మండలం దామరవంచ గురుకులంలో విద్యార్థుల మధ్య గొడవ జరిగి ఘర్షణ వాతావరణానికి దారితీసిన విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పాఠశాలలోని విద్యార్థులు మధ్యాహ్న భోజన సమయంలో గొడవపడినట్లు సమాచారం. ఈ ఘటనలో 8వ తరగతి విద్యార్థి వినోద్ తలకు గాయం కాగా ఆర్ఎంపీ వద్దకు తీసుకెళ్లి ప్రథమ చికిత్స చేయించారు. 8, 9వ తరగతుల విద్యార్థుల మధ్య కొంతకాలంగా సమన్వయలోపం ఉన్నట్లు తెలిసింది. ఈ విషయంపై ప్రిన్సిపాల్ ముత్తయ్య వివరణ కోరగా మధ్యాహ్న భోజన సమయంలో విద్యార్థులు క్యూలో నిలబడే విషయంలో వాగ్వాదం జరిగిందని, ఈ క్రమంలో ఓ విద్యార్థి నెట్టేయగా వినోద్ అనే విద్యార్థి కిందపడి తలకు స్వల్ప గాయమైనట్లు తెలిపారు. వెంటనే మహబూబాబాద్ ఏరియా దవాఖానకు తరలించి చికిత్స చేయించామని, అతడు క్షేమంగా ఉన్నట్లు పేర్కొన్నారు. ఆర్సీ రాజ్యలక్ష్మి చేరుకొని విచారణ చేశారు.



చిట్యాల పోలీసులను ఆశ్రయించిన సుధాకర్ కుటుంబ సభ్యులు

# సుధాకర్ కుటుంబసభ్యుల్లో ఆందోళన

### చల్లగరిగెలో టెన్షన్ వాతావరణం.. అధికారికంగా ప్రకటించని పోలీసులు

చిట్యాల, ఏప్రిల్ 17 : ఛత్తీస్‌గఢ్‌లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో చల్లగరిగె గ్రామానికి చెందిన సిరిపెల్లి సుధాకర్ అలియాస్ శంకర్‌రావు అలియాస్ మురళి మృతి చెందినట్లు వార్తలు రావడంతో గ్రామం ఒక్కసారిగా ఉలిక్కిపడింది. 22 ఏండ్ల క్రితం ఉద్యమబాటలో నడిచిన అప్పటి ఫొటోలకు, ప్రస్తుతం మృతదేహం ఫొటోకు పొంతనలేకపోవడంతో శంకర్‌రావు మృతిపై అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. దీంతో బుధవారం రాత్రి కుటుంబ సభ్యులు, బంధువులు చిట్యాల పోలీసులను ఆశ్రయించగా ఉన్నతాధికారుల నుంచి ఎలాంటి ప్రకటన రాలేదని చెప్పారు. పోలీసుల అనుమతితో శంకర్‌రావు తల్లి సిరిపెల్లి రాజపోశమ్మ, అక్క చిలివేరు విజయ, కళికోట తిరుపతి(కజిన్ బ్రదర్), మాజీ సర్పంచ్ కర్రె అశోక్‌రెడ్డి, సిరిపెల్లి నర్సయ్య ఛత్తీస్‌గఢ్‌కు వెళ్లారు. అయితే మీడియాలో మాత్రం శంకర్‌రావు స్థానంలో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన వ్యక్తి మృతి చెందినట్లు వార్తలు వస్తున్నాయి.

#### మాకు ఎలాంటి సమాచారం లేదు : భూపాలపల్లి ఎస్పీ

చల్లగరిగె గ్రామానికి చెందిన సిరిపెల్లి సుధాకర్ అలియాస్ శంకర్‌రావు మంగళవారం జరిగిన ఎన్‌కౌంటర్‌లో మృతి చెందినట్లు తమకు ఎలాంటి సమాచారం రాలేదని ఎస్పీ కిరణ్‌ఖరే తెలిపారు. ఛత్తీస్‌గఢ్ నుంచి అధికారిక ప్రకటన రాగానే వెల్లడిస్తామని చెప్పారు.

# నామినేషన్లకు వేళాయె..

### నేటి నుంచి 25 వరకు స్వీకరణ .. ఏర్పాట్లు చేసిన అధికార యంత్రాంగం

### వరంగల్, మహబూబాబాద్ కలెక్టరేట్లలో నామినేషన్ల ప్రక్రియ

వరంగల్, మహబూబాబాద్ పార్లమెంట్ నియోజకవర్గాల ఎన్నికలకు నేటి నుంచి నామినేషన్లు స్వీకరించనున్నారు. ఆయా కలెక్టరేట్లలో ఎలక్షన్ నోటిఫికేషన్ విడుదల చేసిన అనంతరం ఉదయం 11 నుంచి నామినేషన్ల ప్రక్రియ ప్రారంభం కానున్నది. ఈ మేరకు అధికార యంత్రాంగం అన్ని ఏర్పాట్లు చేసింది. వరంగల్ నియోజకవర్గం ఆర్‌వోగా కలెక్టర్ పీ ప్రావీణ్య, మహబూబాబాద్ ఆర్‌వోగా అద్వైత్‌కుమార్ వ్యవహరిస్తున్నారు.

– వరంగల్/మహబూబాబాద్, ఏప్రిల్ 17(నమస్తే తెలంగాణ):

వరంగల్, మహబూబాబాద్ పార్లమెంటు నియోజకవర్గం నామినేషన్ల ప్రక్రియ నిర్వహణకు అధికార యంత్రాంగం ఆయా కలెక్టరేట్లలో ఏర్పాట్లు చేసింది. గురువారం నుంచి నామినేషన్ల ఘట్టం ప్రారంభం కానున్న నేపథ్యంలో ఎన్నికల రిటర్నింగ్ అధికారులు ప్రావీణ్య, అద్వైత్‌కుమార్ అధికారులు, సిబ్బందికి సూచనలు చేశారు. నామినేషన్ దాఖలు చేసే అభ్యర్థులకు సహకరించేందుకు, వారి అనుమానాలు నివృత్తి చేయడానికి ఎన్నికల అధికారులు హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేశారు. ఇందులో బుధవారం ట్రయల్ నామినేషన్ల ప్రక్రియ నిర్వహించారు. ఈ సందర్భంగా నామినేషన్లు దాఖలు చేసే అభ్యర్థులు సమర్పించే బ్యాంకు ఖాతా, ఫొటోగ్రాఫ్, ప్రతిపాదకులు తదితర అంశాలకు సంబంధించి సూచనలు చేశారు. నామినేషన్లపై సంపూర్ణ అవగాహన కలిగి ఉండాలని చెప్పారు.

#### 11 గంటల నుంచి స్వీకరణ..

నేటి నుంచి 25 వరకు నామినేషన్లు స్వీకరించనున్నట్లు వరంగల్, మహబూబాబాద్ పార్లమెంటు నియోజకవర్గం ఆర్‌వోలు ప్రావీణ్య, అద్వైత్‌కుమార్ తెలిపారు. ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు నామినేషన్ల స్వీకరణ ఉంటుందని పేర్కొన్నారు. 26న నామినేషన్ల పరిశీలన, 29న ఉపసంహరణ ఉంటుందని వెల్లడించారు. పార్లమెంటు ఎన్నికల్లో పోటీ చేసే ఎస్సీ అభ్యర్థులు రూ.12,500 సెక్యూరిటీ డిపాజిట్ చేయాల్సి ఉంటుందని, ఒక్కో అభ్యర్థి రూ. 95 లక్షలకు మించి ఖర్చు చేయకూడదని అన్నారు. నామినేషన్ వేయడానికి ముందే పోటీ చేసే అభ్యర్థి తన పేరు మీద ఏదేని జాతీయ బ్యాంకులో కొత్త ఖాతా తెరవాలని చెప్పారు. నామినేషన్ వేయడానికి అభ్యర్థితోపాటు మరో నలుగురికి రిటర్నింగ్ కార్యాలయంలోకి వెళ్లేందుకు అనుమతి ఉంటుందన్నారు. రాజకీయ పార్టీల నాయకులు, కార్యకర్తలు రిటర్నింగ్ అధికారి కార్యాలయానికి వంద మీటర్ల దూరంలోనే ఉండాలని, నిబంధనలు అతిక్రమిస్తే కోడ్ ఉల్లంఘన కిందకు వస్తుందని తెలిపారు. రిటర్నింగ్ అధికారి కార్యాలయ సమీపంలో పోలీసులు 144 సెక్షన్ అమలు చేయనున్నట్లు వివరించారు.




మహబూబాబాద్ కలెక్టరేట్‌లో ఆర్‌వో కార్యాలయం

#### మహబూబాబాద్‌లో 1,783 పోలింగ్ కేంద్రాలు

మహబూబాబాద్ పార్లమెంట్ నియోజకవర్గంలో 1,783 పోలింగ్ కేంద్రాల్లో ఏర్పాటు చేసేందుకు బ్యాలెట్ యూనిట్లు, కంట్రోల్ యూనిట్లు, వీవీ ప్యాట్లు సిద్ధం చేశారు. ఈ నియోజకవర్గంలో 15,26,998 మంది ఓటర్లు ఉన్నారు. ఈ సెగ్మెంట్ పరిధిలో ఉన్న 7 అసెంబ్లీ నియోజకవర్గాల్లో పురుషుల ఓటర్ల కంటే మహిళా ఓటర్లే ఎక్కువగా ఉన్నారు. ఎస్టీ పార్లమెంట్ నియోజకవర్గంలో అత్యధిక గిరిజన జనాభాతో పాటు ఓటర్లు ఎక్కువ సంఖ్యలో ఉన్నారు. దీంతో ఇక్కడ అభ్యర్థుల గెలుపు ఎక్కువగా గిరిజన ఓట్లతో పాటు మహిళా ఓటర్లపై ఆధారపడి ఉంటుంది.

**మహబూబాబాద్ పార్లమెంట్ నియోజకవర్గంలో ఓటర్ల వివరాలు**

| నియోజకవర్గం | పురుషులు | మహిళలు | ఇతరులు | మొత్తం |
|---|---|---|---|---|
| డోర్నకల్ | 1,09,150 | 1,13,455 | 07 | 2,22,612 |
| మహబూబాబాద్ | 1,26,611 | 1,31,794 | 46 | 2,58,451 |
| నర్సంపేట | 1,15,068 | 1,20,370 | 09 | 2,35,447 |
| ములుగు | 1,13,592 | 1,19,172 | 27 | 2,32,791 |
| పినపాక | 99,824 | 1,03,798 | 05 | 2,03,627 |
| ఇల్లెందు | 1,09,812 | 1,15,094 | 04 | 2,24,910 |
| భద్రాచలం | 72,925 | 79,597 | 07 | 1,52,529 |
| మొత్తం | 7,46,982 | 7,83,280 | 105 | 15,30,367 |